

ఆలయ ట్రస్టు ఏర్పాటుపై నిరీక్షణ

- వేములవాడ దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై ఆశావహుల ఎదురుచూపులు
- 1963 నుంచి రాజన్న క్షేత్రంలో పాలకవర్గాల ఏర్పాటు
- 12 ఏళ్లుగా ఉత్సవ కమిటీలతోనే వేడుకలు
- కొత్త ప్రభుత్వంలోనైనా ట్రస్ట్‌బోర్డుకు మోక్షం కలిగేనా?

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ట్రస్టుబోర్డు లేకపోవడంతో ఆలనాపాలనా పట్టించుకునే వారే లేరనే విమర్శలు వస్తున్నాయి. 12 ఏళ్లుగా ఆలయ ట్రస్టుబోర్డు లేకపోవడంతో దేవస్థానంలో అనేక విభాగాల్లో నిర్లక్ష్యం కనిపిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్రంలోని ఆలయాలకు ధర్మకర్తల మండలిని నియమిస్తామని ఆరు నెలల క్రితం దేవాలయాల అభివృద్ధికి సంబంధించిన సమీక్ష సమావేశంలో ప్రకటించడం ఆశావహుల్లో ఆసక్తి మొదలైనా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. మార్కెట్ కమిటీలకు నామినేట్ కమిటీలు వేస్తున్న క్రమంలో వేములవాడ దేవస్థానం ఛైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం పలువురు కాంగ్రెస్ నాయకులు ఆసక్తి చూపుతున్నారు. పాలకమండలి ఏర్పాటు ఎలా చేయబోతున్నారన్న దానిపైనా సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రెండు సార్లు పాలకమండలి ఛైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఈ నేపథ్యంలో కమిటీ ఏర్పాటు బాధ్యత ఆది శ్రీనివాస్‌పైనే ఎక్కువగా ఉందని భావన ఏర్పడింది.

ఉత్సవ కమిటీలతో వేడుకలు

రాష్ట్రంలో అతి పెద్ద దేవాలయాల్లో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ముందు వరుసలో ఉంటుంది. మహాశివరాత్రి, శ్రీరామనవమి వేడుకలు, శివకల్యాణోత్సవాలు ఇలా అనేక వేడుకలు ప్రధానంగా నిర్వహిస్తారు. దేవస్థానానికి తెలంగాణ, ఆంధ్రా, రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. ప్రధానంగా మహాశివరాత్రికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. మహాశివరాత్రి సమయంలో మాత్రం ఉత్సవ కమిటీలను నియమించి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీలను నియమించినా వారి ప్రమేయం నామమాత్రంగానే ఉంటుంది. అధికార యంత్రాంగం పెత్తనమే కొనసాగుతుంది. భక్తులకు అందించాల్సిన సేవలపై పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉంటాయి. వేములవాడ దేవస్థానానికి 1963 నుంచి ట్రస్టుబోర్డు నియామకాలు జరుగుతూ వస్తున్నాయి. 2009 - 2013 వరకు మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న ఛైర్మన్‌గా కొనసాగిన తరువాత పాలకవర్గాల ఊసే మర్చిపోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేములవాడ దేవస్థానం అభివృద్ధి కోసం వీటీఏడీఏను 2016లో ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా, సీనియర్ ఐఏఎస్ అధికారిని వైస్ ఛైర్మన్‌గా నియమించినా హైదరాబాద్ నుంచే కార్యకలాపాలు కొనసాగించారు. గత సంవత్సరం వీటీడీఏను వేములవాడకు తరలించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వీటీడీఏ ఛైర్మన్ హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉన్నత అధికారులతో ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో అభివృద్ధిపై సమీక్ష చేశారు. ఇటీవల బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించారు. కానీ పాలకవర్గ నియామకాలపై స్పష్టత మాత్రం రాకపోవడంతో ఆశావహుల్లో నిరాశగానే ఉన్నారు. ఇతర పార్టీల నుంచి నామినేట్ పోస్టుల ఆశతో కాంగ్రెస్‌లో చేరిన వారు ఉన్నారు. రాష్ట్రంలో ఒక వైపు మార్కెట్ కమిటీలు, కార్పొరేషన్‌లకు సంబంధించిన నామినేట్‌పదవులు అందిస్తున్నా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల ఇల్లంతకుంట మార్కెట్ కమిటీ నియామకం మినహా ఎలాంటి నామినేట్ పోస్టుల నియామకం జరగలేదు. మార్కెట్ కమిటీల నియామకం త్వరలో వెలువడుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో వేములవాడ దేవస్థానంతోపాటు గ్రంథాలయ సంస్థ, టెక్స్‌టైల్ కార్పొరేషన్, చిన్న చిన్న దేవాలయాలతోపాటు పలు కార్పొరేషన్లకు డైరెక్టర్ల పదవులు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తూ కాంగ్రెస్ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా వేములవాడ దేవస్థానం ట్రస్ట్ బోర్డు పదవుల పైనే అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

వేములవాడ దేవస్థానం చైర్మన్లు

చైర్మన్	కాలపరిమితి
సీహెచ్ వెంకటేశ్వర్‌రావు	1963 నుంచి 1977
ఎం.కొండల్‌రావు	1977 - 1980
సీహెచ్ వెంకటేశ్వర్‌రావు	1981- 1984
ఉచ్చిడి మోహన్‌రెడ్డి	1984 - 1987
దుగ్గిరాల వెంకట్రావు	1988 -1990
ఉచ్చిడి మోహన్‌రెడ్డి	1992 - 1994
సీహెచ్ కమలాకర్‌రావు	1994 -1996
శికారి విశ్వనాథం	1998 - 1999
శికారి విశ్వనాథం	2002- 2004
ఆది శ్రీనివాస్	2004- 2006
ఆది శ్రీనివాస్	2007- 2009
బొమ్మ వెంకన్న	2009 - 2013



దేవస్థానంలో భక్తులు



ఆలయంలో బాలుడితో కలిసి ఉట్టి కొడుతున్న ఈవో వినోద్‌రెడ్డి

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26: శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా వేములవాడలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వేములవాడలోని వైష్ణవ ఆలయాల్లో ఉదయం 6.30 గంటలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భీమేశ్వర స్వామి ఆలయంలో మహాపూజ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణ మండపములో నిర్వహించిన కార్యక్రమానికి ఈవో వినోద్‌రెడ్డి హాజరయ్యారు. డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. వేములవాడ మండలం ఆరెపల్లిలోని ఇస్కాన్ టెంపుల్‌లో కృష్ణాష్టమి వేడుకలకు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. పట్టణంలో భగవంతరావునగర్‌లోయాదవ యువసేన ఆధ్వర్యంలో ఉట్టికొట్టారు. ఆయా గ్రామాల్లో యువకులు కృష్ణాష్టమి వేడుకలు చేపట్టారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన

శ్రావణ మాసం నాలుగో సోమవారం సందర్భంగా స్వామివారికి ఉదయం 5.30 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 6.30 గంటల నుంచి స్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన నిర్వహించారు. భక్తులు లింగాకృతిలో దీపాలను వెలిగించారు.



కృష్ణాష్టమి సందర్భంగా డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



ఆరెపల్లి ఇస్కాన్ టెంపుల్‌లో ఉట్టికొడుతున్న విప్ ఆది శ్రీనివాస్

శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 26: జిల్లాలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 12 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులపై కఠిన వైఖరి అవలంబిస్తున్నట్లు చెప్పారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారమయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించవచ్చన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం స్వీకరించిన ఫిర్యాదులపై ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలకు ఫోన్‌లో వివరించి చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు.

నేడు హనుమాన్ చాలీసా పారాయణం



ఫ్లెక్సీని విడుదల చేస్తున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు

వేములవాడ టౌన్, ఆగస్టు 26 : దక్షిణకాశీ వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించే హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని హిందూ ఉత్సవ సమితి నిర్వాహకుడు మోటూరి మధు పిలుపునిచ్చారు. 49 వారాలుగా భీమేశ్వరస్వామి ఆలయంలోని ఆంజనేయ స్వామికి హనుమాన్ చాలీసా పారాయణం 49వ వారాలుగా ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్నామన్నారు. 50వ మంగళవారం సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి 50 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని, తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ఆయన వెంట గడప కిషోర్‌రావు హిందూ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఎల్లాగౌడ్

వీర్నపల్లి, ఆగస్టు 26 : విద్యార్థినులు మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై ఎల్లాగౌడ్ సూచించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు మహిళా చట్టాలపై సోమ వారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రభు త్వాలు ప్రత్యేక చట్టాలను రూపొందించాయన్నారు. బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే 100, 181, మహిళల హెల్ప్‌లైన్ నంబరు 1098ను సంప్రదిస్తే ఇబ్బందులు తొలగించడానికి పోలీసులు కృషి చేస్తారని తెలిపారు. అనంతరం కృష్ణాష్టమి వేడుకలకు హాజరయ్యారు. పాఠశాల ప్రత్యేక అధికారి నీలిమా పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

- కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- 75 వేల మందికిపైగా తరలివచ్చిన భక్తులు
- కోడెమొక్కులకు ఐదు గంటలు నిరీక్షణ
- ఏర్పాట్లు పర్యవేక్షించిన ఆలయ ఈవో వినోద్‌రెడ్డి



భక్తులతో రద్దీగా మారిన రాజన్న ఆలయ ఆవరణ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రానికి శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో వేములవాడ పట్టణ పురవీధులు భక్తులతో కిక్కిరిసాయి. రాజన్న దర్శనం కోసం ధర్మ దర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లలో భక్తులు బారులు దీరారు. కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారుగా ఐదు గంటలపాటు నిరీక్షించారు. ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రాజన్న ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. బద్దిపోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారుగా 75వేల మందికిపైగా భక్తులు రాజన్నను దర్శించుకున్నట్లు, ఆలయ ఖజానాకు రూ.35 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఏర్పాటు చేసిన వసతులను ఈవో వినోద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పీఆర్వో కార్యాలయం నుంచి వీవీఐపీల పేరుతో ఆలయంలోకి వెళ్లే దారుల్లో గేట్‌లకు తాళం వేయాలని ఆదేశించారు. దీంతో వీవీఐపీ భక్తులు సైతం బ్రేక్‌దర్శనం టికెట్‌లు తీసుకొని క్యూలైన్‌లో వెళ్లాల్సి వచ్చింది. వీఐపీ దర్శనం కోసం భక్తులు పీఆర్వో కార్యాలయానికి తరలిరావడంతో ఉదయం బ్రేక్‌దర్శనంలో పంపించేందుకు టికెట్‌లను అందించారు.



క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు



సన్మానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 26: ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందని వక్తలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బొప్పాపూర్‌లో మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఏవో భూమిరెడ్డితోపాటు పలువురు అధికారులకు సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సాగుపై ఏవో భూమిరెడ్డి మెళకువలను వివరించారన్నారు. అనంతరం ఏవో భూమిరెడ్డి, అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కోనరావుపేట, ఆగస్టు 26 : కోనరావుపేట మండల వ్యవసాయ అధికారి వెంకట రామమ్మ బదిలీపై వెళ్లగా సోమవారం నిజామాబాద్ రైతు వేదికలో మండల ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలానికి వ్యవసాయ అధికారి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ షాపుల యజమానులు దేవేందర్, బెంద్రే శ్రీనివాస్, రొక్కం ప్రవీణ్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రోడ్డు నిర్మాణానికి నిధులు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మంగళపల్లె వాసులకు హామీ



మంగళపల్లెవాసులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఆగస్టు 26 : కోనరావుపేట మండలం మంగళపల్లె గ్రామ ప్రజల చిరకాల వాంఛ నెరవేరుస్తానని, తారు రోడ్డు నిర్మాణానికి కోటి 30 లక్షల రూపాయలు త్వరలో మంజూరు చేయిస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మండలంలోని మంగళపల్లి గ్రామ ప్రజలు పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం భవనానికి పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంగళపల్లి గ్రామస్థులు బాధనేని బాల్‌రాజు, బి శేఖర్, మల్లేశం, పర్శరాములు, ఎస్.రెడ్డి, బోర్గాయ మల్లయ్య, కిష్టయ్య, ఎస్.రాజిరెడ్డి, ఉప్పుల శేఖర్, కే.మల్లయ్య, ఎస్.మల్లేశం, వెలిశాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



చీర మెడకు బిగుసుకుని మహిళ మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26 : కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన అవురకొండ లక్ష్మి(40) అనే మహిళ మద్యం మత్తులో చీర మెడకు చుట్టుకోగా ఉరి బిగుసుకుని మరణించిందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. లక్ష్మి కొంత కాలంగా మద్యానికి అలవాటుగా మారి మద్యం కోసం కుటుంబ సభ్యులను వేధించేది. ఆదివారం ఉదయం నుంచి మద్యం సేవిస్తూ ఉంది. ఆమె భర్త, కూతురులు పని ఉందని బయటకు వెళ్లారు. మృతురాలి కూతురు వివాహం ఈనెల 28న జరగాల్సి ఉంది. పెళ్లి ఖర్చులకు అప్పు కోసం బయటకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ముందు గదిలో లక్ష్మి బోర్లాపడుకుని ఉంది. నిద్రలేపితే మళ్లీ మద్యం కావాలంటుందనే కారణంతో భర్త, కూతురులు ఆమెను నిద్రలేపే ప్రయత్నం చేయలేదు. కొద్దిసేపటికి లక్ష్మి వద్దకు వెళ్లి చూడగా నాలుక కరుచుకుని ఉంది. స్థానికుల సహాయంతో పరిశీలించగా ఆమె మెడకు చీర బిగుసుకుని చనిపోయి ఉంది. మద్యం మత్తులో లక్ష్మి మెడకు చీరను చుట్టుకోగా అది బిగుసుకుని ఊపిరాడక మరణించిందని మృతుడి కూతు రు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ..

తనిఖీ చేసిన పోలీసులు

తంగళ్లపల్లి, ఆగస్టు 26: బంగారు గొలుసు చోరీకి గురైందని ఓ మహిళ పేర్కొనడంతో తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తాడూర్ చౌరస్తా వద్ద పోలీసులు బస్సును ఆపి తనిఖీ చేశారు. బాధితురాలి వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లాకు చెందిన పులగోని సౌజన్య ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో ఓ శుభకార్యానికి హాజరై స్వగ్రామానికి తిరిగి వెళ్తోంది. ఈక్రమంలో సిరిసిల్ల బస్టాండ్‌లో సిద్దిపేట డిపో బస్సు ఎక్కింది. తన బ్యాగులోని బాక్స్‌లో బంగారు గొలుసు భద్రకుర్చుకుంది. తంగళ్లపల్లికి రాగానే బ్యాగు చూసుకున్న బాధితురాలు గొలుసు పోయిన విషయాన్ని డ్రైవర్‌కు చెప్పి బస్సును నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించింది. తంగళ్లపల్లి పోలీసులు బస్సులోని ప్రయాణికులు, వారి బ్యాగులను తనిఖీ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై బాధితురాలు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లింది.

కొండగట్టు ఆలయంలో ఏఈ పోస్టు ఖాళీ

నెల రోజుల క్రితం బదిలీపై వెళ్లిన అధికారి

మల్యాల, ఆగస్టు 26: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో ఇంజనీరింగ్ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడి ఏఈ లక్ష్మన్‌రావు నెల రోజుల క్రితం సాధరణ బదిలీలలో బాగంగా వేములవాడ రాజరాజేశ్వ రస్వామి దేవస్థానానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్త వారిని నియమించకపోవడంతో నెల రోజులుగా ఇంజనీరింగ్ పనులు నిలిచి పోయినట్లు అయింది. ఈ దేవస్థానం పరిధిలో ఇంజనీరింగ్ పరిధిలో ఏటా లక్షలాది నిధులతో కొత్త పనులు, మరమ్మతులు చేపడుతుంటారు. ఇవన్నీ ఇంజనీరింగ్ అధికారి పర్యవేక్షణలో కొనసాగుతుండగా నెల రోజులగా పనులు ముందుకు వెళ్లడం లేదని తెలుస్తోంది. ప్రతి సంవత్సరం హనుమాన్ చిన్న, పెద్ద జయంతులు, సమ్మక్క సారక్క జాతర సమయంలో ఇంజ నీరింగ్ శాఖ అధ్వర్యంలో పనులు సాగుతుంటాయి. ప్రస్తుతం ఏఈ లేక పోవడంతో ఇంజనీరింగ్ పనులు పడకేశాయి. దేవాదాయ శాఖ అధికారులు కూడా నెల రోజులుగా పట్టించుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

● డీఈ స్థాయిలో నియమించాలి

కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానం రోజురోజుకూ అభివృద్ధి చెందుతుండడంతో అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు గాను ఇక్కడ ఇంజనీరింగ్ శాఖ డీఈ స్థాయి అధి కారితో మరో ఏఈలను నియమించాల్సి ఉంది. ఇందుకు తగిన స్థాయి లో ప్రస్తుతం పనులు కొనసాగుతుండగా ఒక్క ఏఈ మాత్రమే పర్య వేక్షించారు. ఇప్పుడు ఏఈ కూడా లేని పరిస్థితి ఏర్పడింది. గతంలో చేప ట్టిన, చేపట్టబోయో పనుల కోసం ప్రత్యేక ఇంజనీరంగ్ అధికారు లను నియమించాల్సి ఉంది. ఈ విషయమై దేవస్థానం ఈవో రామ కృష్ణరావు ను వివరణ కోరగా ఏఈ పోస్టు ఖాళీ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే నియమించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

రాజన్న చెంత నిద్ర చేస్తానని..

● మరుసటి రోజు అనంతలోకాలకు

● ఆలయ పార్కింగ్ స్థలంలో వృద్ధురాలి మృతి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26: రాజన్నకు మొక్కుకున్నానని... నిద్ర చేసి వస్తానని.. కుటుంబ సభ్యులతో చెప్పి వారిని పంపించి మరుసటి రోజున ఓ వృద్ధురాలు అనంతలోకాలకు వెళ్లిన సంఘటన ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఎన్‌బీటీనగర్ పాటిగడ్డకు చెందిన వంగ లచ్చవ్వ (79) కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాజన్న దర్శనానికి వచ్చింది. రాజన్నను దర్శనం చేసుకున్న అనంతరం తాను రాజన్న ఆలయంలో రెండు రోజులు నిద్ర చేస్తానని మొక్కుకున్నానని, మీరు వెళ్లండి అని కుటుంబ సభ్యులకు చెప్పి వారిని పంపించింది. శనివారం రాత్రి రాజన్న ఆలయంలో నిద్రించింది. ఆదివారం ఆలయ ఆవరణలో ఉంది. ఆదివారం రాత్రి కూడా ఆలయ ఆవరణలో నిద్రించింది. సోమవారం తెల్లవారు జామున రాజన్న ఆలయ పార్కింగ్ స్థలం లో మృతి చెంది భక్తులకు కనిపించింది. లచ్చవ్వ ఆదివారం రాత్రి కొంత అనారోగ్యానికి గురై బాధపడుతూ నిద్రించినట్లు భక్తులు తెలిపారు. లచ్చవ్వ వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని ఆలయ అధికారులు తెలిపారు.

మోతె చెరువు కబ్జాకు యత్నం


అడ్డుకుంటున్న మత్స్యకారులు

జగిత్యాలరూరల్, ఆగస్టు 26: జగిత్యాల మండలంలో గల మోతె పెద్ద చెరువు ను ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలోని కొందరు వ్యక్తులు మట్టిపోసి కబ్జాలకు పాల్పడుతుండగా సమాచారం అందుకున్న మత్స్యకారులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ రెండు రోజుల నుం చి ఎఫ్‌టీఎల్ పరిధిలో జేసీబీతో కొందరు మట్టి తీసి చెరువును కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెరువులను రక్షించాలని చెబుతున్నా అధికార దాహంతో కొందరు నాయకులు కబ్జాకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మోతె చెరువు కబ్జాకు గురికావడంతో మత్స్యకారులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటివరకు మోతె చెరువు ఎఫ్‌టీ ఎల్ పరిధిలోని సుమారు 20 ఎకరాల వరకు భూములను కబ్జా చేసి ఇళ్లు నిర్మించారని, దీంతో చెరువుల విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. కలెక్టర్ స్పందించి ఎఫ్‌టీఎల్ పరిధి నుంచి అక్రమ నిర్మాణాలను తొలగించాలని మత్స్యకారులు కోరుతున్నారు. హైడ్రా తరహాలో జిల్లాలో కూడా ఏర్పాటుచేసి చెరువులను రక్షించాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

















కొనసాగుతున్న ఎత్తిపోతలు

- ప్రాజెక్టుల్లోకి పెరిగిన ఇన్‌ఫ్లోలు

పెద్దపల్లి/ధర్మారం/రామడుగు, ఆగస్టు 26: జిల్లాలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరగడంతో మిడ్ మానేరుకు నంది పంప్‌హౌస్ నుంచి నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. సోమవారం ఉదయం వరకు 27,126 క్యూసెక్కుల ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రాగా, అప్పటి వరకు మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, మరొక మోటారును ఆన్ చేసి 12,600 క్యూసెక్కులకు పెంచారు. సాయంత్రం వరకు ఇన్ ఫ్లో 10,478 క్యూసెక్కులకు తగ్గింది. ఎన్టీపీసీ, హైదరాబాద్, జిల్లా తాగునీటి అవసరాలకు 452 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. మొత్తం ఔట్ ఫ్లో 13,052 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.758 టీఎంసీల నీళ్లున్నాయి. రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం మూడు పంపుల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని తరలించారు. సోమవారం నాలుగు పంపులతో నీటి విడుదలను కొన సాగించారు. నంది పంపు హౌస్ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఒక పంపును నిలిపివేశారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 20 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

ప్రాజెక్టుల నీటిమట్టం వివరాలు

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	24,073	3,822	80.5	57.316
ఎల్లంపల్లి	10,478	13,052	20.175	17.758
మిడ్ మానేరు	13,200	14,600	27.54	18.82
ఎల్ఎండీ	14,816	216	24.034	7.051

మిడ్‌మానేరుకు 13,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 11 వేలు, మూలవాగు మానేరు వాగు ద్వారా 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 18.82 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎల్ఎండీకి ఐదు గేట్ల ద్వారా 14,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3,200 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు.

ఏడు టీఎంసీలకు చేరిన ఎల్ఎండీ

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలో దిగువ మానేరు జలాశ యంలో నీటి నిల్వ ఏడు టీఎంసీలు దాటింది. ఎంఎంఆర్ నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 6063 క్యూసెక్కుల నీరు వచ్చింది. ఉదయం 9 గంటల సమయానికి 9,800 క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రం వరకు 14,600 క్యూసెక్కులకు పెరిగింది. ఎల్ఎండీ పూర్తిస్థాయి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా సోమవారం రాత్రి 9 గంటలకు 7.051 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎంఎంఆర్ నుంచి 14,600 క్యూసెక్కులు, మోయ తుమ్మెద వాగు నుంచి 216 క్యూసెక్కులు, మొత్తం 14,816 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాల కోసం 216 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


ధర్మారం మండలం నంది పంప్‌హౌస్ నుంచి విడుదలవుతున్న గోదావరి జలాలు

జమ్మికుంటలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఎత్తివేత

30 ఏళ్లకు పైగా ఆగుతున్న రైలు

జమ్మికుంట, ఆగస్టు 26: వ్యాపార కేంద్రంగా ఉన్న జమ్మికుంటలోని రైల్వేస్టేషన్‌లో కొద్ది రోజుల క్రితం దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఎత్తివేశారు. హైదరాబాద్ నుంచి హజ్రత్ నిజాముద్దీన్ (12721), నిజాముద్దీన్ నుంచి హైదరాబాద్ (12722) వరకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు గత 30సంవత్సరాలకు పైగా జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో ఆగుతుండేది. ఇటీవల హాల్టింగ్ ఎత్తివేయడంతో ప్రయాణికులు అవస్థ లు పడుతున్నారు. జమ్మికుంట మండలంతో పాటు పరిసర మండలాలకు చెందిన గ్రామాల ప్రజలు ఇటు హైదరాబాద్ నుంచి కాగజ్‌నగర్ వరకు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. జమ్మికుంటకు చెందిన వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు హైదరాబాద్‌లో తమ పనులను ముగించుకొని రాత్రి సమయంలో హైదరాబాద్ నుంచి జమ్మికుంటకు చేరుకోవ డానికి దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ ఎంతో అనుకూలంగా ఉండేది. హాల్టింగ్ ఎత్తివేయడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంటలో హాల్టింగ్ ఉన్నట్లు రైల్వే సమాచారాన్ని తెలిపే యాప్‌లలో చూపిస్తోంది. జమ్మికుంటకు చెందిన ప్రయాణికులు తర్వాత స్టేషన్ పెద్దపల్లిలో దిగి జమ్మికుంటకు చేరుకుంటున్నారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ చొరవ తీసుకుని దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌ను జమ్మికుంట రైల్వేస్టేషన్లో హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


జమ్మికుంట రైల్వే స్టేషన్



సీఎంఆర్ఎఫ్ నకిలీ బిల్లులపై సీఐడీ విచారణ

ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రైవేట్ ఆసుపత్రులపై క్రిమినల్ కేసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26: నకిలీ బిల్లులు చూపించి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి అక్రమంగా కోట్ల రూపాయలు స్వాహా చేసిన ప్రైవేట్ ఆసుపత్రులపై సీఐడీ రాష్ట్ర వ్యాప్తంగా క్రిమినల్ కేసులు నమోదు చేసింది. గత ప్రభుత్వ హయాంలో నకిలీ బిల్లులతో కోట్ల రూపాయలు స్వాహా చేసిన కుంభకోణంలో ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బంది, రాజకీయపార్టీల నాయకులు, అధికారులున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో జరిగిన ఈ కుంభకోణంపై సీఎం రేవంత్‌రెడ్డి సీఐడీ విచారణకు ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన సీఐడీ పోలీసు అధికారులు విచారణను చేపట్టారు.

ఎమ్మెల్యేలకు సంబంధించిన నకిలీ లెటర్ ప్యాడ్‌లు, ఔషధాలు, ల్యాబ్ రిపోర్ట్‌లు, ఇతర పత్రాలకు సంబంధించి నకిలీ రశీదులు, పత్రాలతో కొందరు సీఎంఆర్ఎఫ్ బిల్లులు పొందారని సీఐడీ విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని నాలుగు ప్రైవేట్ ఆసుపత్రుల పై సీఐడీ క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. జమ్మికుంట (సప్తగిరి), పెద్దపల్లి (శ్రీసాయి), గోదావరిఖని ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన సీఐడీ అధికారులు చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. సీఐడీ అధికారులు ఇప్పటికే కొందరిని విచారించి వాంగ్మూలం రికార్డు చేసినట్లు తెలిసింది. కేసులు నమోదైన ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించిన సీఐడీ అధికారులు నకిలీ రశీదులు, ఇతర రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో కొందరు రాజకీయ నాయకులున్నట్లు తెలిసింది.

ఏడాదికాలంగా సీఎంఆర్ ఎఫ్ బిల్లులు పొందిన లబ్ధిదారుల జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సీఐడీ అధికారులు విచారణ చేపట్టగా చాలా బిల్లులు నకిలీవని తేలినట్లు సమాచారం. కొన్ని కేసుల్లో వైద్యం పొందలేదని, వారి పేరిట వచ్చిన సీఎంఆర్ఎఫ్ బిల్లులో లబ్ధిదారులకు కొంత డబ్బులు అందజేసిన మధ్యవర్తులు మిగతా సొమ్ములు కాజేసినట్లు విచారణలో వెల్లడైందని తెలిసింది. ఆసుపత్రుల నిర్వాహకులు, సిబ్బంది ప్రమేయంపై లోతుగా విచారణ కొనసాగుతున్నది. ఈ కుంభకోణంతో ప్రమేయం ఉన్న వారిని త్వరలోనే అరెస్టు చేసే అవకాశముంది.

రెస్టారెంట్లలో మున్సిపల్ అధికారుల సోదాలు

కోరుట్ల, ఆగస్టు 26 : పట్టణంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో మున్సిపల్ అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలే అశోక్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. పలు రెస్టారెంట్‌లలో కుళ్లిపోయిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని వాటిని పట్టణ శివారులోని డంపింగ్ యార్డులో పూడ్చి పెట్టారు. పరిశుభ్రత పాటించని రెస్టారెంట్, హోటల్ యజమానులకు రూ. 32వేల వరకు జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరు పతి మాట్లాడారు. నాణ్యమైన ఆహారం విక్రయించాలని ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకోని తినుబండారాలను విక్రయించాలని అన్నారు. నాణ్యమైన ఆహారం విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది జగ్గల్ల రమేష్, జవాన్‌లు చిట్యాల గంగరాజం, రమేష్, చిట్యాల రాజుకుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.


నిలువ ఉంచిన చికెన్


కుళ్లిపోయిన ఆహారాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

ఏసీబీ దాడులతో రాజన్న ఆలయంలో దిద్దుబాటు చర్యలు

ఆలయంలోని 20 మంది ఉద్యోగుల అంతర్గత బదిలీలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26 : రాజన్న ఆలయంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన ఏసీబీ దాడులతో ఆలయంలో ఈవో వినోద్‌రెడ్డి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఆలయంలోని పలు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 20 మంది ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు. ఆలయంలో సెంట్రల్ గోదాం, గోశాల, టెంపుల్ సానిటేషన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నర్సయ్యను గోశాల, టెంపుల్ సానిటేషన్, హౌస్ కీపింగ్, అన్ని వసతి గదుల సానిటేషన్ మెయింటేనెన్స్‌కు బదిలీ చేశారు. సూపరింటెండెంట్ అశోక్‌ను నిత్యాన్నదాన సత్రానికి, పార్కింగ్ సానిటేషన్‌కు బదిలీ చేశారు. మరో సూపరింటెండెంట్ సంతోష్‌ను అకౌంట్, సెంట్రల్ గోదాం సెక్షన్‌కు బదిలీ చేయగా, తొమ్మిది మంది సీనియర్ అసిస్టెంట్‌లను, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లను, ఐదుగురు రికార్డు అసిస్టెంట్‌లను ఒక పరిచారికతో కలిపి మొత్తం 20 మంది ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేసినట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.

కొడుకులు పట్టించుకోవడం లేదు

న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు


నరసవ్వ

తిమ్మాపూర్, ఆగస్టు 26: తనను కొడుకులు పట్టించుకోవడం లేదంటూ ఓ వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌కి చెందిన నరసవ్వకు నలుగురు కుమారులు, ముగ్గురు కూతుళ్లు సంతానం. భర్త, ఓ కుమారుడు, ఓ కూతురు మరణించారు. భర్త చనిపోయిన తరువాత నరసవ్వ ముగ్గురు కుమారులు అంజయ్య, లక్ష్మణ్, రవి వద్ద రెండు నెలల చొప్పున ఉంటోంది. అయితే కొంత కాలం తరువాత వారి మధ్యలో బేదాభిప్రాయాలు రావడంతో ఎవరు కూడా తల్లిని చేరదీసేందుకు ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం నరసవ్వ తన కూతురు వద్ద ఉంటోంది.

తనను కుమారులు చేరదీయడం లేదని ఆదివారం సాయంత్రం ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. ఎల్ఎండీ ఎస్సై చేరాలుకు తన గోడు వెళ్లబోసుకుంది. న్యాయం చేయాలని వేడుకుంది. ఎస్సై చేరాలు సోమవారం అలుగునూర్‌లోని వృద్ధురాలు వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. కుమారులతో మాట్లాడి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. కుమారులు అందుబాటులో లేకపోవడంతో తిరిగి మంగళవారం మాట్లాడనున్నట్లు తెలిపారు. వృద్ధురాలికి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని లేకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చేరాలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మహిళాశిశు వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ రఫీయోద్దీన్ అలుగునూర్‌లోని నరసవ్వ ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ నరసవ్వకు అందుతుందని, వాటితోనే మందులను కొనుగోలు చేసుకుంటున్నట్లు నరసవ్వ తెలిపింది.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

ధర్మపురి, ఆగస్టు 26: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో భక్త జన సందడి నెలకొంది. శ్రావణ మాసం నాలుగవ సోమవారం శివనామస్మరణలు చేసిన భక్తులతో క్షేత్రంలోని శివాలయాలు కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించి అనంతరం ఆలయాలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు శివుడికి జలాభిషేకం, బిల్వార్చన జరిపి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. అక్కపెల్లి రాజ రాజేశ్వరునికి అన్న పూజ చేయించారు. సాయంత్రం రామలింగేశ్వర స్వామి వారల సేవ పురవీధుల గుండా నంది వాహనంపై ఊరేగింపు జరిపారు. దేవాలయాల్లో ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, బూస ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారలకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎం ఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తులతో కిట కిటలాడిన శివాలయాలు


రామలింగేశ్వర స్వామి వారల సేవను ఊరేగింపు

కోటిలింగాలలో భక్తుల పూజలు

వెల్గటూర్: మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాల పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు పుష్కర ఘాట్లపై ఇసుకతో శివ లింగాలను చేసి పూజలు చేశారు. అనంతరం పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గర్భ గుడిలోని సైకత లింగాన్ని దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు.


జడ్జి నారాయణను ఆశీర్వదిస్తున్న అర్చకులు

స్వామివారిని దర్శించుకున్న జిల్లా జడ్జి

కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని సోమవారం జిల్లా జడ్జి నారాయణ దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చనలు అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కాంతారెడ్డి అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మలు జడ్జికి శాలువా కప్పి సత్కరించారు. అర్చకులు ఆయనకు స్వామి ప్రసాదం అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు.

పిల్లల ఆసుపత్రిలో వికటించిన ఇంజెక్షన్

బాలుడికి తీవ్ర అస్వస్థత

కోల్‌సిటీ, ఆగస్టు 26: గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని ఒక ప్రైవేట్ పిల్లల ఆసుపత్రిలో బాలుడికి ఇంజెక్షన్ వికటించింది. మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ బాలుడిని 15 రోజుల క్రితం లక్ష్మీనగర్‌లోని ఆసుపత్రికి తీసుకురాగా పిల్లల వైద్య నిపుణుడు పరీక్షించి ఇంజెక్షన్ ఇచ్చినట్టు బాధితులు పేర్కొన్నారు. ఇంటికి తీసుకెళ్లే సరికి ఒళ్లంతా పొక్కులు రావడంతో హుటాహుటిన కరీంనగర్‌కు తరలించి అక్కడ పరిస్థితి మెరుగు పడకపోవడంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించామన్నారు. రూ.3లక్షలకుపైగా వ్యయం అయినట్టు బాధితులు శనివారం పేర్కొన్నారు. సంబంధిత ఆసుపత్రి నిర్వాహకులు రూ.50వేలు పంపించి మళ్లీ స్పందించడం లేదన్నారు. ఈ ఘటన పట్టణంలో చర్చనీయాంశం అయ్యింది.

అన్నపై కత్తితో దాడి

వేములవాడ రూరల్, ఆగస్టు 26 : అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసిన సంఘటన వేములవాడ రూరల్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని నమిలిగుండుపల్లికి చెందిన చెరుకు మహేందర్ రెడ్డికి అతడి తమ్ముడు చెరుకు శ్రీకాంత్‌రెడ్డికి సోమవారం డబ్బుల విషయంలో మాటామాట పెరిగి గొడవ జరిగింది. గొడవలో శ్రీకాంత్ అన్నపై కత్తితో దాడి చేశాడు. దాడిలో మహేందర్ రెడ్డికి స్వల్పంగా గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు మహేందర్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జ్వరంతో వృద్ధుడి మృతి

కోనరావుపేట, ఆగస్టు 26: మండలంలోని మామిడిపల్లికి చెందిన మారు లక్ష్మారెడ్డి (75) సోమవారం జ్వరంతో మృతి చెందాడు. మామిడిపల్లికి చెందిన లక్ష్మారెడ్డి వద్ధాప్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు. ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు ఇంట్లోనే మందులు అందిస్తున్నారు. సోమవారం జ్వరం ఎక్కువవడంతో పరిస్థితి విషమించి మరణించాడు. లక్ష్మారెడ్డి కొద్దిరోజులుగా ఫిట్స్‌తో కూడా బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మారెడ్డికి భార్య జనవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

డీజే సీజ్.. కేసు నమోదు

తంగళ్లపల్లి ఆగస్టు 26: అనుమతి లేకుండా డీజేను నడుపుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు, డీజేను సీజ్ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి అనుమతి లేకుండా డీజే నడుపుతున్నారనే సమాచారం మేరకు దాడు లు నిర్వహించామని పేర్కొన్నారు. డీజే యజమాని దీరుపాల సతీష్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, ఆగస్టు 26: ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామంలోని మూలవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం ఉదయం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మోయినికుంట వద్ద పట్టుకున్నామని, ఇసుకను తరలిస్తున్న పులి రాకేష్, ప్రశాంత్, బోరివెల్లి బాస్కర్, ఈర్ల నరేష్‌ను అదుపులోకి తీసుకొని రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని పేర్కొన్నారు.

ఉరివేసుకుని యువతి ఆత్మహత్య

జూలపల్లి, ఆగస్టు 26. మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన దేవరాని సంకీర్తన (23) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరాని సంకీర్తన తల్లి సత్తమ్మ కొద్ది నెలల కితం మృతిచెందినది. తల్లి మృతిని తట్టుకోలేని సంకీర్తన తీవ్ర మనస్తాపానికి గురైనది. తన తల్లి లేకుండా బతుకలేనని తరచుగా కుటుంబ సభ్యులకు తెలిపేది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని సంకీర్తన మృతి చెందింది. సంకీర్తన మృతిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


సురేష్ (ఫైల్)

ఇల్లందకుంట, ఆగస్టు 26: మండలంలోని చిన్నకోమటిపల్లె గ్రామానికి చెందిన మూడెడ్ల సురేష్ (21) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే అతనిని జమ్మి కుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి అందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం సాయంత్రం మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి..


సందీప్ మృతదేహం

వీణవంక, ఆగస్టు 26: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని ఘన్ముక్ల గ్రామానికి చెందిన కాగిత సందీప్ (20) తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పాటు తరచూ కడుపు నొప్పితో బాధపడుతూ కళాశాలకు వెళ్లడం లేదు. కడుపు నొప్పి భరించలేక ఆదివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో జమ్మికుంటలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడి తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కమాన్‌పూర్, ఆగస్టు 26: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గాదె బాలయ్య తను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్ఐ కొట్టె ప్రసాద్ సోమవారం అందజేశారు. 2023 డిసెంబరు 10న కమాన్‌పూర్ నుంచి నాగారం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. దీంతో మీ సేవ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రత్యేక యాప్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ కోసం అన్వేషించారు. ఇటీవల రాజస్థాన్‌లో సెల్ ఆచూకీ లభించింది. సెల్ లోకేషన్ ఆధారంగా ఫోన్‌ను ఉపయోగించిన వ్యక్తికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో సదరు సెల్‌ఫోన్‌ను కలిగిన వ్యక్తి కమాన్‌పూర్ పోలీసులకు సెల్‌ఫోన్‌ను పంపించారు. తొమ్మిది నెలల అనంతరం తన సెల్‌ఫోన్‌ను కనిపెట్టి అందజేసిన ఎస్ఐ, కానిస్టేబుల్ కొత్తపల్లి బాలకృష్ణకు బాలయ్య కృతజ్ఞతలు తెలిపారు.

శంకరపట్నం: సిరిసిల్లకు చెందిన ప్రముఖ కళాకారుడు ఆకునూరి దేవయ్య తన రూ. 80వేల విలువ గల స్మార్ట్‌ఫోన్ కేశవపట్నంలో పోయిందని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేశవపట్నం ఎస్సై రవి దర్యాప్తులో సీసీ టీవీ పరిశీలనలో మొబైల్‌ని కనుక్కొని తిరిగి ఫిర్యాదుదారుడికి అప్పగించారు. ఫిర్యాదుదారుడు ఆకునూర్ దేవయ్య కేశవపట్నం ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 26:మండలంలోని రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని పదర గ్రామానికి చెందిన వ్యక్తి గండికోట శ్రీనివాస్ తన బైక్ పై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి పడిపోవడంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మండల కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



వేములవాడలో చిన్నారితో కలిసి ఉట్టికొడుతున్న విప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్లలోని రెయిన్‌బో ఇంగ్లీష్‌మీడియం స్కూల్‌లో వేడుకలు



తంగళ్లపల్లిలో వేడుకల్లో విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, అగస్టు 26: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్, రగుడు గ్రామాల్లోని శ్రీకృష్ణయాదవ సంఘాల అధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పెద్దూర్ గ్రామంలోని గోపాల యూత్ అసోషియేషన్, శ్రీకృష్ణయాదవ సంఘాల అధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుంచి ఒగ్గు కళాకారుల బృందంతో డోలు చప్పుల్ల తో నృత్యాలు చేస్తూ ఒగ్గు కళాకారుల విన్యాసాలతో శోభయాత్రను చేపట్టారు. అనంతరం శ్రీకృష్ణయాదవ సంఘం వద్ద ఉట్టి కోట్టడంతో పాటు పిల్లలకు వేషాలను వేయించి నృత్యాలు చేయించారు. అలాగే రగుడు గ్రామంలో యాదవ సంఘం అధ్వర్యంలో ఉట్టి కోట్టే కార్యక్రమాన్ని చేపట్టి సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో 1 వవార్డు కౌన్సిలర్ పోచవేని సత్యఎల్లయ్యయాదవ్‌తోపాటు పెద్దూర్ గోపాల యూత్ అధ్యక్షుడు సలేంద్రి మహేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడు నక్క నరేష్‌యాదవ్, కోశాధికారి సలేంద్రి శేఖర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సలేంద్రి ప్రశాంత్‌యాదవ్, కార్యదర్శి సలేంద్రి మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలో పలు ప్రైవేటు పాఠశాలల్లో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ వెంకట్రావునగర్‌లోని విజ్ఞాన్ హైస్కూల్ విద్యసంస్థలతో పాటు గాంధీనగర్‌లోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులు గోపిక లుగా గోపాలురుగా వేషాలను వేసి ఉట్టి కొట్టారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టగా విద్యార్థులు వివిధ వేషధారణలతో నృత్యప్రదర్శనలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ నాగుల శ్రీనివాస్‌గౌడ్, విజ్ఞాన్ హైస్కూల్ ఇంగ్లీష్‌మీడియం కరస్పాండెంట్ బొద్దుల సుదర్శన్, శ్రీగాధ గణేష్, కూనపల్లి సురేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

● **ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, దుమాల, అక్కపల్లి, తదితర గ్రామాల్లో యువజన, యాదవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు.

● **ముస్తాబాద్:** ముస్తాబాద్ మండలంలోని మహర్షి, నవజ్యోతి, శివాని, శాంతినికేతన్ పాఠశాలలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. చిన్నికృష్ణులు ఉట్టికొట్టేందుకు పోటీపడ్డారు.

● **వీర్నపల్లి:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకొని యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. వేడుకల్లో సెస్ మాడుగుల మల్లేశం, యాదవ సంఘం సభ్యులు పేరం ప్రశాంత్, పర్మాల మల్లేశం, పృథ్వి, రవి సభ్యులు పాల్గొన్నారు.

● **తంగళ్లపల్లి:** తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శుభోదయం ఇంగ్లీష్ మీడియం పాఠశాలతో పాటు సారంపెల్లి గ్రామంలోని శ్రీ సిద్ధార్థ విద్యానికేతన్ పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల కరస్పాండెంట్‌లు శ్రీనివాస్‌యాదవ్, రాజనర్సు పాల్గొన్నారు.

● **గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలోని ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు సోమవారం నిర్వహించారు. చిన్నారులు, చిన్నికృష్ణులు, రాధాగోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాలలో చిన్నికృష్ణులు ఉట్టి కొడుతూ సందడి చేశారు. ప్రిన్సిపాల్ సంతోష్ రెడ్డి, ఉపాధ్యాయులు చేపూరి కిషన్, దేవరాజ్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో..

వేములవాడ: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వేములవాడలోని అంజనీనగర్‌లో చైతన్య యూత్ ఆధ్వర్యంలో, కేదారేశ్వర వీధిలో న్యూ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు పట్టణంలో పలు చోట్ల వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక సరస్వతి శిశుమందిర్ ఆవరణలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు.

● **కోనరావుపేట:** కోనరావుపేట మండల కేంద్రంతో పాటు ధర్మారం తదిత గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయ ఆవరణలో ఉట్టిని ఏర్పాటు చేసి ఉట్టిని కొడుతూ సంబరాలు జరుపుకున్నారు. పలు గ్రామాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● **చందుర్తి:** చందుర్తి మండల కేంద్రంతో పాటు మల్యాల, వివిధ గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చందుర్తిలోని యాదవ సంఘం వద్ద, మల్యాలలోని శ్రీకృష్ణుని చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు, యువకులు ఉట్టి కొట్టారు. మాజీ ఉప సర్పంచ్ చిర్రం తిరుపతి, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, కుల సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● **రుద్రంగి:** రుద్రంగి మండల కేంద్రంలో సర్వజన గణేష్ మండలి ఆధ్వర్యంలో ఇందిరాచౌక్ చౌరస్తా వద్ద యువకులు పోటాపోటీగా ఉట్టి కొట్టారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చిన్నారులు, యువకులు ఉట్టి కొట్టారు.



సిరిసిల్ల పెద్దూర్‌లో కృష్ణాష్టమి వేడుకలు



చందుర్తిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



రుద్రంగిలో..

వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



వినాయక మండపాల నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై

ఇల్లంతకుంట, ఆగస్టు 26: వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం వినాయక మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిప్రపత్తుల మధ్య జరుపుకోవాలని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగేలా సౌండ్స్ పెట్టవద్దన్నారు. ప్రజల వద్ద నుంచి బలవంతంగా చందాలు వసూలు చేయవద్దన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సమావేశానికి అన్ని గ్రామాల నుంచి వినాయక మండపాల నిర్వాహకులు హాజరుకావాలని కోరారు.

డీజేలు సీజ్ చేస్తాం

వీర్నపల్లి, ఆగస్టు 26 : వినాయక ఉత్సవాల్లో డీజే సౌండ్స్‌ని వినియోగించుకునేందుకు అనుమతి లేదని ఎస్సై ఎల్లాగౌడ్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని డీజే యజమానులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ధ్వని కాలుష్యానికి కారణమవుతున్న డీజేలను ఉపయోగించడంతో పండుగ వాతావరణం దెబ్బతింటుందన్నారు. అనుమతి లేని వాటిని వినియోగించి నిబంధనలు ఉల్లంఘించరాదని సూచించారు. డీజేలు పెట్టేందుకు ముందస్తుగా వినాయక మండప నిర్వాహకులు నుంచి అడ్వాన్స్‌లు తీసుకోవద్దన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ కేసుల్లో చిక్కుకోవద్దని సూచించారు.

గణేశ్ ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఎల్లారెడ్డిపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద భద్రత, అక్రమ విద్యుత్ తదితర అంశాలపై వివరించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. నిబంధనలను విధిగా పాటించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి ఎస్సైలు రమాకాంత్, రామ్మోహన్, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 26: తెలంగాణలో టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారని జిల్లా నాయకుడు అన్నాడి నరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం చంద్రబాబును కలిసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని, సభ్యత్వాల నమోదు ప్రారంభించాలని సూచించినట్లు తెలిపారు.

కేటీఆర్ యువసేన కార్యక్రమాలు విస్తరించాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 26: కేటీఆర్ యువసేన కార్యక్రమాలను వినత్తరించాలని కేటీఆర్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్‌ను మండల నాయకులు సోమవారం కోరారు. కార్యక్రమంలో మానకొండూర్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఒరుపుల రాములు, మండల అధ్యక్షుడు కొలపురి కార్తీక్ తదితరులు ఉన్నారు.

మాలమహానాడు యువత అధ్యక్షుడిగా హరీష్

ఇల్లంతకుంట, ఆగస్టు 26: మాలమహానాడు యువత అధ్యక్షుడిగా మామిడి హరీష్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షులుగా మామిడి మల్లికార్జున్, జక్కుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా రాకం సుమన్, కార్యదర్శిగా మామిడి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా మామిడి రాజు, కోశాధికారిగా మామిడి చందు, గౌరవ అధ్యక్షులుగా జక్కుల రాజు, చాతర్ల రాజుతోపాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

పంచాయతీ కార్యదర్శిపై వేధింపులు సరికాదు

ఇల్లంతకుంట, ఆగస్టు 26: గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వేధించడం సరికాదని, వెంటనే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల కన్వీనర్ దెశెట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు యత్నించిన శ్రీనివాస్‌ను సోమవారం ఎల్లారెడ్డిపేట ప్రైవేటు ఆసుపత్రిలో పరామర్శించారు. ఉన్నతస్థాయి ఉద్యోగం వచ్చిందని, రిలీవ్ చేయాలని కోరగా అధికారులు తిప్పుకోవడంపై మండిపడ్డారు. ప్రస్తుతం మండలంలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. ఆయన వెంట జిల్లా నాయకుడు అమ్ముల అశోక్‌యాదవ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ హెల్పర్‌కు గాయాలు

● ఆపరేటర్ నిర్లక్ష్యంతోనేనని రైతుల ఆగ్రహం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 26: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో ట్రాన్స్‌ఫార్మర్‌పై మరమ్మతు చేస్తుండగా అసిస్టెంట్ హెల్పర్ మోకినపల్లి దేవరాజు విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. సబ్‌స్టేషన్ ఆపరేటర్ మహేశ్ విధుల్లో నిర్లక్ష్యంతోనే దేవరాజు గాయపడ్డాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోరుట్లపేట శివారులో వారం రోజులుగా పొలాలకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో మరమ్మతు కోసం అసిస్టెంట్ హెల్పర్ దేవరాజు సబ్‌స్టేషన్ ఆపరేటర్ మహేశ్ దృష్టికి తీసుకెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి పనులు చేస్తున్న క్రమంలో ఆపరేటర్ మహేశ్ తప్పిదంతో విద్యుత్ సరఫరా కావడంతో దేవరాజు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా యాలపాలయ్యాడు. వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదస్థలంలో ఉన్న రైతులు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకునే సరికి ఆపరేటర్ మహేశ్ తన మిత్రులతో కలిసి కల్లు తాగుతుండడం గమనించారు. ఆగ్రహించిన రైతులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. మహేశ్ నిర్లక్ష్యంతో దేవరాజు విద్యుదాఘాతానికి గురయ్యాడని మండిపడ్డారు. సమాచారం అందుకున్న 'సెస్' అధికారులు అక్కడి చేరుకొని రైతులను శాంతింపజేశారు. అనంతరం మండల కేంద్రంలో చికిత్స పొందుతున్న దేవరాజును పరామర్శించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి ప్రమాదానికి కారణమైన సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హామీలు నెరవేర్చాలి

వీర్నపల్లి, ఆగస్టు 26 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సీపీఐ నాయకులతో కలిసి సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ షరతులు లేకుండా పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. పలువురు రైతులు రుణమాఫీ కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారన్నారు. రుణమాఫీ కానీ రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రైతు సమస్యలపై 28న కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 26: షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొంత మంది రైతులకు రేషన్‌కార్డులు లేకపోవడంతో రుణం మాఫీ కాలేదన్నారు. రుణమాఫీ కానీ రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. అర్హులందరికీ రుణమాఫీ చేయాలని ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత

మల్యాల, ఆగస్టు 26: కొండగట్టు అంజనేయస్వామి దర్శనంకు వచ్చిన భక్తుడు పోగొట్టుకున్న బ్యాగ్‌ను స్థానిక పోలీస్ అవుట్‌పోస్టు పోలీసులు వెతికి పట్టుకొని అప్పగించారు. మంచిర్యాలకు చెందిన అంగడి రాజ్‌కుమార్ అనే భక్తుడు సోమవారం అంజనేయస్వామి దర్శనానికి వచ్చి ఆలయంలో బ్యాగ్‌ను పోగొట్టుకున్నాడు. రెండు సెల్‌ఫోన్లు, ఏటీఎం కార్డుతో పాటు రూ.వెయ్యి నగదు ఉన్నాయి. సెక్యూరిటీ సిబ్బందికి తెలుపడంతో వెతికి అప్పగించారు

రాజకీయ కక్షతోనే విద్యుత్ కోతలు

● సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 26: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిననాటి నుంచి రాజకీయ కక్షతో సెస్ బీఆర్ఎస్ పాలకవర్గం, అధికారులు విద్యుత్ కోతలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నట్లు సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ పట్టణ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో విద్యుత్ కోతలతో దోమలు విజృంభిస్తున్నాయని, జనం విషజ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వాడలో దోమలతో సహవాసం చేస్తున్నారని మలేరియా, డెంగ్యూ బారిన పడుతున్నారని అన్నారు. సెస్ అధికారులకు విద్యుత్ కోతలపై ఫోన్ చేస్తే సరైన సమాధానం ఉండడం లేదని ఆరోపించారు. విష జ్వరాల బారిన పడుతున్న కార్మిక వాడల ప్రజల కోసం వెంటనే బస్తీ దవఖానాలను ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కోతలతోపాటు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసే విధంగా కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కక్ష సాధింపులకు పాల్పడుతున్న సెస్ బీఆర్ఎస్ పాలకవర్గం, అధికారులు తమ విధానాలను మార్చుకోకపోతే కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ నాయకులు అజ్జ వేణు, అడిచర్ల రాజు, సదానందం, ఎగుర్ల మల్లయ్య, గాజుల మల్లయ్య పాల్గొన్నారు.

మురికికూపంగా మైసమ్మ చెరువు

● కోళ్ల వ్యర్థాలు, కొబ్బరిబోండాలతో దుర్గంధం ● పట్టించుకోని మున్సిపల్ అధికారులు



పెద్దూర్ మైసమ్మ చెరువులో పోసిన కొబ్బరిబోండాలు



మైసమ్మ చెరువులో కోళ్ల వ్యర్థాల సంచులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 26 : సిరిసిల్ల పట్టణ శివారులో ఉన్న మైసమ్మ చెరువు మురికికూపంగా మారింది. మున్సిపల్, ఇరిగేషన్‌శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామ శివారులో ఉన్న మైసమ్మ చెరువును మిషన్ కాకతీయ పథకం కింద మూడు సంవత్సరాల క్రితం మరమ్మతు చేసి బాగు చేశారు. ఈ చెరువు శిఖం భూముల్లో పెద్దూర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ధాన్యాన్ని పోసేందుకు సింగిల్ విండో అధికారులు శిఖం భూమి చదును చేయించి అక్కడే ధాన్యం కొనుగోలు చేస్తుంటారు. అయితే ఆ కొనుగోలు కేంద్రం కోసం చదును చేసిన ప్రాంతంతో పాటు చెరువులో సిరిసిల్ల పట్టణంలో కొబ్బరిబోండాలను విక్రయించే వ్యాపారులు తాగి పడేసిన కొబ్బరి బొండాలను ఈ చెరువులోనే వేస్తున్నారు. మరోవైపు చికెన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను సైతం వేయడంతొ దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. మురికి కూపంగా మారిపోతున్న చెరువును శుభ్రం చేయించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యర్థాలను తొలగించాలి



- అదిపెల్లి నారాయణగౌడ్, రైతు పెద్దూర్

పెద్దూర్ శివారులోని మైసమ్మ చెరువులో సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల చేయడానికి చదును చేయించారు. అక్కడ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలతోపాటు కొబ్బరి బోండాలను వేయడంతో మురికికూపంగా మారింది. దుర్గంధం వెధజల్లుతోంది. చెరువు పక్కనే ఉన్న పొలాలకు పోయేందుకు వీలు లేకుండా అయింది. మున్సిపల్ అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి చెరువును కాపాడాలి.

ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణకు ఇబ్బందిగా ఉంది

- జెట్టా దేవయ్య, మాజీ ఉపసర్పంచ్, పెద్దూర్



పెద్దూర్ గ్రామ శివారులో ఉన్న మైసమ్మ చెరువు శిఖంలో .సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రతి సారి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులనుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అయితే కొనుగోలు ప్రాంతంతో పాటు మైసమ్మ చెరువులో వ్యాపారులు కొబ్బరి బోండాలతోపాలు, కోళ్ల వ్యర్థాలు అక్కడే వేయడంతో దుర్వాసన వచ్చి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అక్కడ వ్యర్థాలు, కొబ్బరి బోండాలను వేసే వారికి జరిమానా విధించాలి.



మైసమ్మ చెరువు వద్ద చెత్తాచెదారం

శాంతియుతంగా పండుగ నిర్వహించాలి

కోనరావుపేట, ఆగస్టు 26: గ్రామాల్లో వినాయక మండపాలను నిర్వహించే ప్రతీ ఒక్కరు శాంతియుతంగా జరుపుకోవాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట కేంద్రంలోని రైతు వేదికలో వినాయక మండపాల నిర్వాహకులతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలీసుల సూచనల మేరకు మండపాలను నిర్వహించుకోవాలని అన్నారు. ఎస్సై రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.

గజసింగవరంలో నాటు తుపాకీ కలకలం

గంభీరావుపేట ఆగస్టు 26 : గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో ఆదివారం రాత్రి నాటు తుపాకీ లభ్యం కావడం కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. గజసింగవరంలో ఓ వ్యక్తి ఇంట్లో నాటు తుపాకీ ఉన్నట్టు సమాచారం మేరకు పోలీసులు ఆ గ్రామానికి చేరుకున్నారు. స్థానిక ఎస్సై రామ్మోహన్ ఆధ్వర్యంలో అనుమానిత వ్యక్తి ఇంట్లో సోదాలు చేపట్టారు. ఆ ఇంట్లో వన్యప్రాణులను వేటాడేందుకు వినియోగించేదిగా భావిస్తున్న నాటు తుపాకీ లభించింది. ఇంట్లో దాచి పెట్టిన నాటు తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను గమనించి నాటు తుపాకి వినియోగించే సదరు వ్యక్తి అప్పటికే పారిపోయాడు. నాటు తుపాకి పేలిన శబ్దం వినిపించి నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై స్థానిక ఎస్సై రామ్మోహన్ వివరణ కోరగా నాటు తుపాకీని స్వాధీనం చేసు కున్న మాట వాస్తవమేనని, విచారణ కొనసాగుతోందని తెలి పారు. ఇదిలా ఉండగా నాటు తుపాకీ వినియోగించే సదరు వ్యక్తి సోమవారం పోలీసులకు లొంగిపోయినట్టు సమాచారం.

మాల మహానాడు ఐక్య సంఘం కమిటీ

వీర్నపల్లి, ఆగస్టు 26: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఐక్య సంఘం కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షు డిగా పాటి దినకర్, ఉపాధ్యక్షుడిగా లక్కం బాబు, మాందాల నర్సయ్య కమటం రజని కుమార్, ప్రధాన కార్యదర్శిగా గంగాధరి రాజు, కోశాధికా రిగా గంగాధరి సంజీవ్, సలహాదారులుగా హన్మయ్య, దేవానందం, శంక ర్, బాబు, రాజేందర్, బాస్కర్ ఎన్నికయ్యారు.

హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

చందుర్తి, ఆగస్టు 26: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చందుర్తి మండలం లింగంపేటకు చెందిన కొనతల రమ్య (22) మృతి చెందింది. రమ్య హైదరాబాద్‌లో ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. సోమవారం మధ్యాహ్నం కార్యాలయం నుంచి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తోంది. వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీ కొట్టడం రమ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో లింగంపేటలో విషాదం చోటుచేసుకుంది.